క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ సోనీ

జూలూరుపాడు: మండలంలోని అన్నారుపాడు గ్రామంలో రూ.4.50 లక్షల విలువైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బానోత్ పద్మతో కలిసి జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ భూమి పూజ నిర్వహించి, పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మ మాట్లాడుతూ... ఎమ్మెల్యే రాములు నాయక్ కృషి ఫలితంగా మంజూరైన సీసీ రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు.

కమ్యూనిజమే ప్రత్యామ్నాయం



మాట్లాడుతున్న సోమయ్య

సుజాతనగర్: నేటి సమాజంలో మానవాళి మనుగడకు కమ్యూనిజమే ప్రత్యామ్నాయమని సీపీఎం రాష్ట్ర నాయకుడు పి.సోమయ్య అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సుజాతనగర్‌లో జరిగిన రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం పేదల కోసం ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేటీకరణ చేస్తూ ప్రజల సొమ్మును కొల్లగొడుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన పోడురైతులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాసాని ఐలయ్య, కున్సోత్ ధర్మా, వీర్ల రమేష్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు



కనకయ్యకు ధ్రువపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: జూలూరుపాడు న్యూకాలనీకి చెందిన వేమూరి కనకయ్య భార్య సరస్వతి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు ఆమెకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దొండపాటి శ్రీనివాస్ ఆదివారం తెలిపిన వివరాలు.. కనకయ్య ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ దృష్టికి తీసుకెళ్లగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు సిఫార్సు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కూకట్‌పల్లి బీఆర్ఎస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు సహకారంతో మంత్రి తన్నీరు హరీష్‌రావును కూడా కలిసినట్లు చెప్పారు. ఈ మేరకు తక్షణ సహాయం కింద రూ.2.50 లక్షలు మంజూరు చేశారన్నారు. సంబంధిత పత్రాలను కనకయ్యకు అందజేసినట్లు పేర్కొన్నారు.

‘ఉపాధి’లో కనీస సౌకర్యాలు కరువు

- పనిప్రదేశంలో నీడ, నీళ్లు లేవు
- కనిపించని మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు
- పట్టించుకోని అధికారులు



పాండురంగాపురం అటవీ ప్రాంతంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పాల్వంచరూరల్: అసలే మే నెల అందులో రోహిణీ కార్తె.. ఎండలు తీవ్రంగా ఉన్నాయి. రాష్ట్రంలోనే ఉష్ణోగ్రతల్లో జిల్లా ప్రథమ స్థానంలో ఉంటోంది. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన సత్తా చూపిస్తున్నాడు. మధ్యాహ్నం వడగాల్పులు వీస్తున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు ఇదే పరిస్థితి. ఇలాంటి వాతావరణంలో కాసేపు బయట ఉండాలంటే ప్రజలు హడలి పోతున్నారు. అలాంటిది పల్లెల్లో ఉపాధి పనులకు వెళ్లిన వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలో వేసవి తీవ్రత మరింత అధికంగా ఉంటుంది. ఇలాంటి తరుణంలో ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. కానీ మండలంలో ఎక్కడా పని ప్రదేశాల వద్ద కనీస వసతులు కల్పించకుండా చోద్యం చూస్తున్నారని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 36 గ్రామపంచాయతీల పరిధిలో నాలుగు వేల మంది కూలీలు నిత్యం ఉపాధి హామీ పనులు చేస్తున్నారు.

పని ప్రదేశంలో నీడ, నీళ్ల కరువు..

ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశంలో నీడలేదు. తాగటానికి గుక్కెడు నీళ్లు దొరకడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాండురంగాపురం పంచాయతీలో ఉపాధి కూలీలు నెలరోజులుగా ఎండలో అటవీ ప్రాంతంలో పనులు చేస్తున్నారు. ఎండ తీవ్రతకు కాసేపు నీడకు వెళ్దామన్నా చెట్ల నీడ సక్రమంగా లేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా కూలీలు, చిన్నపిల్లల తల్లులు అవస్థలు పడుతున్నారు. వెంట తీసువెళ్లిన వాటర్ బాటిల్ కూడా రెండుసార్లు తాగితే ఖాళీ అయిపోతోంది. దీంతో తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు.

కనిపించని మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు..

కూలీలు పనులు చేస్తున్న సమయంలో ప్రాథమిక చికిత్స అందించేందుకు కనీసం మెడికల్ కిట్లు కూడా అందుబాటులో లేవు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడ అధికారులు అందించడం లేదు. దీంతో కూలీలు ఇక్కట్లు పడుతున్నారు.



చెట్ల పొదల నీడలో కూర్చున్న కూలీలు

నాలుగేళ్ల క్రితం టెంట్లు ఇచ్చారు



ఉపాధి కూలీలకు నాలుగు సంవత్సరాల క్రితం నీడ కోసం టెంట్లు ఇచ్చారు. అవి ఎప్పుడో చిరిగి పోయాయి. ఇక్క ఇప్పటి ఉపాధి కూలీలకు టెంట్లు ఇవ్వడం లేదు. తీవ్రంగా ఎండ ఉండడంతో కాసేపు నీడకు వెళ్లేందుకు చుట్టు పక్కల ప్రాంతంలో చెట్లు కూడా లేవు.

– సున్నం ఉపేదర్, ఉపాధి కూలీ

నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలి



ఉపాధి పనులు చేసే ప్రదేశంలో కూలీలకు నీడ కోసం టెంట్లు వేయాలి. తాగునీటి సౌకర్యంతోపాటు మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా తప్పక అందుబాటులో ఉంచాలి. అధికారులు ఇప్పటికైనా స్పందించి పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలి.

– పచ్చిపాల భాస్కర్, ఉపాధి కూలీ

ప్రతిపాదనలు పంపించాం



వేసవి తీవ్రత దృష్ట్యా ఉపాధి కూలీలకు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పాం. నాలుగేళ్ల క్రితం టెంట్లు ఇచ్చాం. కొత్త టెంట్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. 500 ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశాం. పంచాయతీ సిబ్బందికి ఇచ్చి కూలీలకు అందజేయాలని చెప్పాం.

– పి.రంగా, ఏపీఓ

సెప్టెంబర్ 2న బొడ్రాయి ప్రతిష్ఠ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: పట్టణంలోని శివాలయంలో అటు పూజారులు, ఇటు కొన్ని కులసంఘాలతో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ అనుకూల బొడ్రాయి ప్రతిష్ఠ కమిటీ, ఎమ్మెల్యే హరిప్రియ, హరిసింగ్ నాయక్‌లు ఆదివారం సమావేశమయ్యారు. స్థానికుల అభిప్రాయాలు తెలుసుకుని సెప్టెంబర్ 2న పట్టణంలో బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమయానికి పట్టణ ప్రజలను సమాయత్తం చేయాలని, సభలు సమావేశాలు నిర్వహించి ప్రజలను సిద్ధం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హరిప్రియ, హరిసింగ్ దంపతులు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, కొక్కు నాగేశ్వరరావు, జేకే శ్రీనివాస్, మనోహర్ తివారీ, సుధీర్‌తోత్లా, రాంచందర్, పింగళి నరేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జీఎం షాలేమురాజు

ఇల్లెందు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం షాలేమురాజు సింగరేణి అధికారులను కోరారు. ఆదివారం ఇల్లెందులోని తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏరియాలోని గనులు, విభాగాల అధిపతులతో మాట్లాడారు. జూన్ 5న జరగనున్న సింగరేణి సంబురాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. తొలిరోజు అన్ని డిపార్ట్‌మెంట్లలో జెండా ఆవిష్కరణలు జరపాలని, సింగరణి ప్రగతిని వివరిస్తూ ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్యానర్లు ఏర్పాటు చేయాలని, అద్భుత ప్రగతి పుస్తకాలను పంపిణీ చేయాలని కోరారు. 134 ఏళ్ల సింగరేణి చరిత్రలో సాధించిన ప్రగతిని కార్మికుల ముందు ఉంచాలని సూచించారు. లఘు వీడియో చిత్రం ప్రదర్శించాలని, ఉద్యోగులందరికీ స్వీటు బాక్సులు అందజేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షులు పంజాల శ్రీనివాసు, ఏజీఎం గిరిధర్‌రావు, ప్రాజెక్టు అధికారులు ప్రహ్లాద్, బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, రామచంద్ర, విజయ శేఖర్ బాబు, డాక్టర్ మల్లారెడ్డి, సుధాకర్, అంజిరెడ్డి, శ్రీహరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలపై చిన్నచూపు వీడాలి



నిరసన దీక్ష చేస్తున్న వీఓఏలు

ఇల్లెందురూరల్: ప్రభుత్వం చిన్నచూపు వల్లే తమ న్యాయమైన డిమాండ్లు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని వీఓఏ సంఘం నాయకులు వాపోయారు. తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 42వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు నబీ మాట్లాడుతూ.. పొదుపు సంఘాల బలోపేతం కోసం అహర్నిశలు శ్రమించిన వీఓఏల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అర్హులైన వీఓఏలను సీసీలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నవ్య, మోతీలాల్, ప్రమీల, పాపారావు, వసంతరావు, సుల్తానా, లీలావతి, వసంత, సునిత, సురేష్, రమేష్, వెంకటలక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ వైతాళికుడు ‘సురవరం’



కొత్తగూడెంఅర్బన్: సురవరం చిత్రపటానికి పూలమాల వేస్తున్న వరలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాజకీయాలకు తొలితరం దిక్సూచిగా నిలిచి, ప్రజల్లో సాంఘిక చైతన్యాన్ని రగిలించిన బహుముఖ వైతాళిక ప్రతాపుడు సురవరం ప్రతాపరెడ్డి అని గ్రంథ పాలకురాలు డి.వరలక్ష్మీదేవి అన్నారు. సురవరం 127వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ.. సురవరం బహుభాషా కోవిదుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, సంపాదకుడిగా, రచయితగా, ప్రేరకునిగా, క్రియాశీల ఉద్యమకారునిగా అయన కృషి అనిర్వచనీయం అన్నారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ, ఫారసీ, భాషలో ప్రావీణ్యం ఉన్న ఆయన గోల్కొండ, ఆనాటి నైజాం నిరంకుశ పాలనను ఎండగడుతూ తెలుగు వారి అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేసి వారిని చైతన్య వంతులుగా తీర్చిదిద్దేందుకు ఎనలేని కృషి చేసినట్లు చెప్పారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఆంధ్రుల సాంఘిక చరిత్రకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు కూడా దక్కిందన్నారు. కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు జి.మణిమృదుల, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లెందు: తెలంగాణ రాజకీయాలలో తొలితరం దిక్సూచిగా నిలిచి ప్రజల్లో సాంఘిక చైతన్యాన్ని రగిలించిన బహుముఖ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి అని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్ కొనియాడారు. ఆదివారం ఇల్లెందు శాఖ గ్రంథాలయంలో సురవరం ప్రతాపరెడ్డి 127వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో పులిగళ్ల మాధవరావు, డేరంగుల పోషం, అజ్మీరా భావ్‌సింగ్, పాలడుగు శేఖర్, రాచపల్లి శ్రీనివాస్, ముత్తయ్య, శ్రీనివాస రెడ్డి, గిన్నారపు మహేందర్, మునిగంటి శివ, గ్రంథాలయ పాలకురాలు రుక్మిణీ పాల్గొన్నారు.

గోశాలకు వరిగడ్డి వితరణ



వరిగడ్డిని అందజేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: స్థానిక పట్టణ పరిధిలోని శాస్త్రీ రోడ్డులో గల శ్రీ సీతారామాలయంలోని గోశాలకు తోట సత్యనారాయణ, స్వర్ణ దంపతుల చిన్నారులు దివ్యశ్రీ,, లేఖశ్రీల జన్మదినం సందర్భంగా ఆదివారం వంద కట్టల వరిగడ్డిని వితరణగా చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కాశీ, శివ తదితరులు పాల్గొన్నారు.

భక్తులూ.. తరలిరండి

టేకులపల్లి: కోయగూడెం గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించనున్నారు. ఈ మేరకు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు వివరాలు వెల్లడించారు. కోయగూడెం అయ్యప్ప భక్తబృందం ఆధ్వర్యంలో గ్రామంలో సోమవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కేరళ తంత్రి మాధవన్ నంబూద్రి చేత పూజా కార్యక్రమాలు జరుతుగున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



తాగునీటిని అందజేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: మందేరకలపాడు గ్రామపంచాయతీ ఒంటిగుడిసె, బంజర గ్రామపంచాయతీ చిరుతానిపాడు గ్రామంలో తాగునీటి కోసం ఆదివాసీ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైళ్లదూరం వెళ్లి వాగుల్లో చెలిమలు తీసి తాగునీరు తెచ్చుకుంటూ అవస్థలు పడుతున్నారు. దీనిపై ఇటీవల సాక్షి దినపత్రికలో వార్తాకథనం కూడా ప్రచురితమైంది. దీనికి స్పందించిన డాక్టర్ జీఎస్ఆర్ ట్రస్ట్ యువసేన ఆధ్వర్యంలో ఆయా ఆదివాసీ గిరిజన గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసి దాహార్తిని తీరుస్తున్నారు. ఇంటివద్దకు వచ్చి ట్యాంకర్లతో తాగునీటినీ అందిస్తున్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు ఆదివాసీ గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

‘బండి’పై ఫిర్యాదు

ఇల్లెందు: బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ మీద చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇల్లెందు బీఆర్ఎస్ నేతలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం బీఆర్ఎస్ నేత యలమద్ది రవి ఆధ్వర్యంలో సీఐ టి.కరుణాకర్‌కు ఫిర్యాదు అందజేశారు. నిరుద్యోగ మార్చ్ పేరుతో ఖమ్మంలో జరిగిన సభలో ఆయన సీఎం మీద అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. తక్షణం క్షమాపణ చెప్పాలని లేదంటే చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. మేకల శ్యాం, ఆదూరి రవి, మహేందర్, రాజశేఖర్, పాలడుగు శేఖర్, హరీష్, చంద్రావతి, భాగ్య పాల్గొన్నారు.

నిరుద్యోగులను పట్టించుకోని పాలకులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి మోకాళ్ల రమేష్ విమర్శించారు. జూన్ 5, 6 తేదీలలో ఖమ్మంలో నిర్వహించే పీవైఎల్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలోని మాణిక్యారం గ్రామంలో ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతతో ఓట్ల రాజకీయం చేస్తూ రాజకీయ పావులుగా మార్చివేస్తున్నారని ఆరోపించారు. కనీసం ధరలను కూడా అదుపులోకి తేలేని స్థితిలో ఉన్న పాలకులు వారిని ఆర్థిక ఇబ్బందులోకి నెట్టివేస్తున్నారని వాపోయారు. ఇటువంటి పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ భవిష్యత్‌లో చేయాల్సిన ఆందోళన కార్యక్రమాలకు రాష్ట్ర మహాసభలలో రూపకల్పన చేస్తారని చెప్పారు. మహాసభలకు యువత అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో రావూరి ఉపేందర్, నవీన్, స్వాతి, కల్యాణ్, కోటేష్, మాధవరావు, బుచ్చయ్య, సమ్మయ్య, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో అసాంఘిక శక్తులు



మాట్లాడుతున్న రవికుమార్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అసాంఘిక శక్తులకు హెల్త్ డైరెక్టర్ పదవిలో ఉన్న గడల శ్రీనివాస్ అండగా నిలుస్తున్నారని బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్ ఆరోపించారు. ఆదివారం బూడిదగడ్డ బస్తీలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెంలో కొన్ని రోజులుగా ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని కలుషితం చేసేందుకు కొన్ని అసాంఘిక శక్తులను గడల శ్రీనివాస్ పెంచి పోషిస్తున్నాడని విమర్శించారు. ఆయన పర్యటన సందర్భంగా ఎవరైతే ఫ్లెక్సీలు, ర్యాలీలు నిర్వహిస్తారో వాళ్లు గత సోమవారం త్రీ టౌన్ పరిధిలోని ఒక ఇంట్లోకి చొరబడి ఒక వ్యక్తిపై విచక్షణ రహితంగా దాడి చేశారని ఆరోపించారు. ఈ విషయంపై సదరు వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందడంతో పాటు దాడిలో పాల్గొన్న గడల అనుచరుల పేర్లు కూడా ఫిర్యాదులో ఉన్నట్లు చెప్పారు. కేసును నీరు కార్చేందుకువిశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గంధం మల్లికార్జునరావు, సిద్దంకి మల్లేష్, అల్లకొండ శరత్, రాయకుల శంకర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సుజాతనగర్: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని టీపీసీసీ సభ్యుడు ఎడవల్లి కృష్ణ అన్నారు. సీతంపేట గ్రామంలో ముక్కెర నరేందర్ జ్ఞాపకార్థం వాలీబాల్ పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో మొదటి, రెండో బహుమతులు పొందిన కరివారిగూడెం, సింగభూపాలెం టీములకు నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడినవారు స్ఫూర్తితో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భూక్యా పద్మావతి, సీపీఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, నాయకులు పెద్దమళ్ల నాగేశ్వరరావు, చంద్రగిరి సత్యనారాయణ, మాచిన శ్రీకాంత్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



పోటీలో పాల్గొన్న మహిళలు

ఇల్లెందు: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం షాలేము రాజు ఆదేశాల మేరకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆదివారం సింగరేణి పాఠశాల మైదానంలో సేవా సమితి సభ్యులు, ఉద్యోగుల కుటుంబాల మహిళలు పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రతిభ కనబరిచిన మహిళలకు జూన్ 5న బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీవైపీఎం శ్రీహరి, కృష్ణ, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఎస్.సుధాకర్, న్యాయ నిర్ణేత బొల్లం హేమలత, సేవా సెక్రెటరీ విజయ, సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్, సాంబయ్య, కిషోర్, విజయకుమారి పాల్గొన్నారు.

తెలుగు ప్రజల గుండెల్లో ఎన్‌టీఆర్‌కు సుస్థిరస్థానం

స్వర్గీయ ఎన్‌టీఆర్ నటుడిగా, ముఖ్యమంత్రిగా తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని, ఆయన ఆశయాలను, కలలను నెరవేర్చాలని పలువురు వక్తలు అన్నారు. ఎన్‌టీఆర్ శతజయంతి సందర్భంగా ఆదివారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో పార్టీలకతీతంగా అభిమానులు, ప్రజాప్రతినిధులు ఎన్‌టీఆర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పలుచోట్ల అన్నదానం నిర్వహించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: కేక్ కట్ చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్వర్ణకుమారి తదితరులు



ఇల్లెందు: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ



కొత్తగూడెంటౌన్: సెవెన్‌హిల్స్ ఏరియాలో..



చుంచుపల్లి: మాట్లాడుతున్న కూనంనేని



టేకులపల్లిలో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు

అటెన్షన్ ప్లీజ్

కూడలిలో పొంచి ఉన్న ప్రమాదం..

నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. పాల్వంచ పట్టణంలోని దమ్మపేట సెంటర్‌లోని ప్రధాన కూడలిలో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. ఇటు ములకలపల్లి, అటు కొత్తగూడెం వైపు వెళ్లే మార్గంలో రోడ్డు బాగా దెబ్బతిన్నది. రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలుమార్లు నాయకులకు, అధికారులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా హైవే, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనాదారులు కోరుతున్నారు.



– పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : వంశీ, ఆర్అండ్‌బీ ఏఈ
సెల్ నెంబర్: 9603465426